క్లుప్తంగా

పంట నమోదు తప్పనిసరి



ఎస్.చెన్నంపల్లెలో పంట నమోదు చేస్తున్న సిబ్బంది

కొలిమిగుండ్ల: ఉద్యాన రైతులు తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని ఉద్యాన శాఖాధికారిణి ధరణి అన్నారు. మంగళవారం ఎస్.చెన్నంపల్లె, అబ్దులాపురం, కొలిమిగుండ్ల గ్రామాల్లో చేస్తున్న పంట నమోదును ఆమె పరిశీలించారు. ప్రభుత్వ పథకాలు, రుణాలు, రాయితీలు అందాలంటే ప్రతి రైతు పంట నమోదు చేసుకోవాలని సూచించారు. మిరప, పండ్ల తోటలు సాగు చేసే రైతులకు ఈ–క్రాప్ చేయించుకోవడం వల్ల ప్రయోజనం ఉంటుందని చెప్పారు. క్షేత్ర స్థాయిలో జరుగుతున్న కార్యక్రమానికి రైతులు సహకరించాలని కోరారు.

వ్యాయామంతో ఆరోగ్యం పదిలం



ప్రతిజ్ఞ చేస్తున్న తహసీల్దార్, సిబ్బంది

బేతంచెర్ల: ప్రతి రోజు వాకింగ్, వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యం పదిలంగా ఉంటుందని, మానసిక ఒత్తిడి దూరమవుతుందని తహసీల్దార్ ప్రకాశ్‌బాబు అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య సంరక్షణకు ప్రతి రోజు కొంత సమయం కేటాయిస్తామని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం వ్యాయామానికి కనీసం 30 నిమిషాల సమయం కేటాయించాలని సూచించారు. ఆరోగ్యంగా ఉంటేనే సక్రమంగా విధులు నిర్వహించగలమని పేర్కొన్నారు. డీటీ మధు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వెంకటలక్ష్మి

కోవెలకుంట్ల: విద్యార్థులు ఆరోగ్య సూత్రాలు పాటించాలని కోవెలకుంట్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ డాక్టర్లు వెంకటలక్ష్మి, సృజన అన్నారు. మంగళవారం పట్టణ శివారులోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థినులకు హిమోగ్లోబిన్, బీఎంఐ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహా భాగ్యమని, ఆరోగ్యం దెబ్బతింటే తిరిగి పొందడం కష్టమని.. అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చదువు విషయంలో ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా జీవన శైలిలో మార్పులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, మాయలూరు పీహెచ్‌సీ డాక్టర్ రాబర్ట్ కెన్నెడి, అధ్యాపకుడు రామసుబ్బారెడ్డి, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఐదు రోజుల గణేష్ ఉత్సవాలకు వినతి



డీఎస్పీకి వినతి పత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

డోన్ టౌన్: డోన్ పట్టణంలో ఐదు రోజుల పాటు గణేష్ ఉత్సవాలు జరుపుకునేందుకు అనుమతి ఇవ్వాలని ఉత్సవ కమిటీ సభ్యులు మంగళవారం డీఎస్పీ శ్రీనివాసులు, ఎమ్మెల్యే కోట్లను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఎనిమిదేళ్లుగా మూడు రోజులు నిర్వహించుకునేందుకే అనుమతి ఇస్తున్నారని.. భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది నుంచి ఐదు రోజులు జరుపుకునేందుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై డీఎస్పీ, ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఫణిరాజ్, సభ్యులు వెంకటరమణ, హనుమంతరెడ్డి, రవికుమార్ తెలిపారు.

కందిలో సస్యరక్షణతో తెగుళ్ల నివారణ



కంది పంటను పరిశీలిస్తున్న దోన్ వ్యవసాయశాఖ ఏడీఏ

బేతంచెర్ల: కంది పంటలో తెగుళ్ల నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని డోన్ వ్యవసాయ శాఖ ఏడీఏ అశోక్‌వర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గోర్లగుట్ట గ్రామంలో ఏఓ కిరణ్ కుమార్‌తో కలిసి కంది పంటను పరిశీలించారు. తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎకరాకు అర లీటర్ ప్రొఫినోఫాస్, అరలీటర్ వేపనూనె కలిపి పిచికారీ చేసుకోవడం ద్వారా వైరస్‌ను వ్యాప్తి చేసే నల్లిని అరికట్టవచ్చని తెలిపారు. ఆయనతో అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రజ్ఞా, రైతు మద్దిలేటి రెడ్డి ఉన్నారు.

చట్టాలను కట్టుదిట్టం చేయాలి



మహిళా డాక్టర్లు, వైద్య సిబ్బందిపై దాడులు, అత్యాచారాలకు పాల్పడే నిందితులను శిక్షించే చట్టాలను మరింత కట్టుదిట్టం చేయాలి. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచార ఘటన చాలా విచారకరం. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సెక్యూరిటీని పెంచడంతోపాటు ప్రతి విభాగాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

–డాక్టర్ విద్యాసాగర్, రేవనూరు పీహెచ్‌సీ, కోవెలకుంట్ల

వైద్యులకు భద్రత అవసరం



ఆస్పత్రుల్లో వైద్యులకు తగిన భద్రత కల్పించాలి. వైద్యులు తమ కుటుంబ బాగోగుల గురించి ఆలోచించకుండా వృత్తిలో నిమగ్నమై ఉంటారు. చికిత్సపరంగా అనుమానాలు ఉంటే మాట్లాడి నివృత్తి చేసుకోవాలి. రోగి ప్రాణాలు కాపాడాలన్న లక్ష్యంతోనే వైద్యులు చికిత్స చేస్తారు. ప్రజలు వైద్యులతో స్నేహపూర్వకంగా ఉన్నప్పుడే ఆస్పత్రుల్లో మంచి వాతావరణం ఉంటుంది. మహిళా సిబ్బందికి తగిన గౌరవం ఇవ్వాలి. విధి నిర్వహణలో ఉన్న మహిళా సిబ్బందితో అనుచితంగా ప్రవర్తించడం మంచిది కాదు. భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలి.

–నితీష్ కుమార్, వైద్యాధికారి, ప్యాపిలి



అవుకు: రామాపురంలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



బేతంచెర్ల: శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు



డోన్: బహుమతులు అందుకున్న చిన్నారులతో ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు

కోలాహలంగా గోకులాష్టమి వేడుకలు

- కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారుల సందడి
- ఉత్సాహంగా ఉట్లోత్సవం
- డోన్‌లో యాదవ సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



డోన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న యాదవ, కురువ సంఘీయులు



బేతంచెర్ల: గోపాలకృష్ణ బృందావనంలో ఉట్టి కొడుతున్న పిల్లలు

అవుకు: బనగానపల్లె, డోన్ నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో గోకులాష్టమి వేడుకలను మంగళవారం కోలాహలంగా జరుపుకున్నారు. అవుకు మండలం రామాపురం గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి–ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో గ్రామంలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని కొలువుదీర్చారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం మార్కెట్, ఆంజనేయ స్వామిగుడి మీదుగా స్వామివారి ఊరేగింపు సందడిగా సాగింది. భక్తులు కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులు సమర్పించారు.

కనుల పండువగా వేడుకలు

డోన్ టౌన్: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా మంగళవారం యాదవ, కురవ సంఘీయుల ఆధ్వర్యంలో డోన్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణ సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ ఎదురుగా ఉన్న కాల్వ వద్ద శ్రీకృష్ణుని గుడి నిర్మాణానికి ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి భూమి పూజ చేశారు. పట్టణంలోని రైల్వే గేట్ నుంచి పాతబస్టాండ్ మీదుగా ఐటీఐ వరకు నిర్వహించిన భారీ ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యేను శ్రీకృష్ణుని వేషధారణ వేయించి సంబరాలు చేసుకున్నారు. ప్రొద్దుటూరుకు చెందిన కళాకారులు వేంకటేశ్వరస్వామి, అలివేలు మంగమ్మ, శ్రీకృష్ణుడు, సత్యభామ, నరసింహ స్వామి, భక్త ప్రహ్లాద తదితర వేషధారణలు వేసి ర్యాలీలో ఆకట్టుకున్నారు. యాదవ, కురవ సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే పాత బస్టాండ్‌లో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి–ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కృష్ణుని విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అంబరాన్నంటిన సంబరం

బేతంచెర్ల: పట్టణ సమీపంలోని బృందావనంలో కృష్ణాష్టమి వేడుకలు అంబరాన్నంటాయి. ఉదయం కాలనీ మహిళలు కృష్ణునికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. శ్లోకాలు పఠించారు. శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో ఆకట్టుకున్న చిన్నారులకు ఆలయ కమిటీ సభ్యుల చేతుల మీదుగా నగదు, మిగిలిన 60 మందికి ప్రోత్సాహక బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం కాలనీ వాసులు రంగులు చల్లుకుంటూ ఉట్టికొట్టి సందడి చేశారు. రేపల్లెలో శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహాలను మేళతాళాల నడుమ ఊరేగించారు. సుమేధా స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు వెంకట్, వీరారెడ్డి, నాగరాజు, మద్దిలేటి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్యాలు

డోన్ టౌన్: ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో చిన్నారులకు గోపిక, శ్రీకృష్ణుడి వేషధారణ వేయించారు. పిల్లల నృత్యాలు, కోలాటాలు ఆకట్టుకున్నాయి. అనంతరం నోటు పుస్తకాలు, చాక్లెట్లు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు మద్దమ్మ, సుమిత్ర, సుజాత, షాలిని, శకుంతల, రాజేశ్వరి, స్కూల్ డీన్ నాగరాజు పాల్గొన్నారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

బేతంచెర్ల: మండలంలోని మద్దిలేటి నరసింహ స్వామి ఆలయ హుండీ కానుకలను బుధవారం లెక్కించనున్నారు. జూలై 30వ తేదీ నుంచి ఆగస్టు 27వ తేదీ వరకు భక్తులు స్వామివారికి సమర్పించిన కానుకలను లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ రామాంజనేయులు తెలిపారు.

కిరాణా దుకాణంలో చోరీ

- రూ. 1.35 లక్షలు అపహరణ

కోవెలకుంట్ల: స్థానిక వెలగటూరు రస్తాలోని ఓ కిరాణా దుకాణంలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. బాధితుడి వివరాల మేరకు.. కోవెలకుంట్లకు చెందిన నాగేంద్ర కిరాణ దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. రాత్రి దుకాణం మూసి వేసి ఇంటికి వెళ్లాడు. గుర్తు తెలియని వ్యక్తులు షాపు షట్టర్ తాళాలను పగలగొట్టి లోపలికి ప్రవేశించి క్యాష్ పెట్టెలో ఉన్న రూ. 1.35 లక్షలను చోరీ చేశారు. తిరిగి షటర్ మూసి పారిపోయారు. మంగళవారం ఉదయం షాపు యజమాని వచ్చే చూడగా తాళాలు పగలగొట్టి ఉండడంతో షటర్ తెరిచి చూశాడు. చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. క్లూస్‌టీం రంగ ప్రవేశం చేసి ఆధారాలు సేకరించింది. చోరీ ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

యువకుడి ఆత్మహత్య



ఉగ్గు సంజీవరాయుడు మృతదేహం

బనగానపల్లె రూరల్: అనారోగ్య కారణాలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం నందివర్గం గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఉగ్గు దస్తగిరి, సావిత్రమ్మ కుమారుడు ఉగ్గు సంజీవరాయుడు(32) రెండేళ్ల క్రితం బస్సు నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గాయం నుంచి కోలుకున్నా నరాల బలహీనతతో పాటు మానసికంగా కుంగిపోయాడు. పలువురు వైద్యుల వద్ద చూపించినా నయం కాకపోవడంతో మానస్తాపం చెందాడు. ఈ క్రమంలో మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి తండ్రి దస్తగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ టీటీ వెంకటసుబ్బయ్య తెలిపారు. కాగా ఏకైక కుమారుడు ఆత్మహత్య చేసుకోవడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



సైబర్ మోసాలపై అవగాహన కల్పిస్తున్న ఇన్ఫస్ సంస్థ ప్రతినిధి మహేష్

బనగానపల్లె రూరల్: సైబర్ మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఇన్ఫస్ సంస్థ ప్రతినిధి మహేష్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మహేష్ మాట్లాడుతూ..ఉద్యోగాలు ఇస్తామని.. లక్కీడిప్‌లో మీ మొబైల్ నంబర్‌కు గిఫ్ట్ తగిలిందని వచ్చే మేసేజ్‌లపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారం పబ్లిక్‌గా ఉంచొద్దని..తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. బ్యాంకు నుంచి కాల్ చేస్తున్నామని ఓటీపీలు అడిగితే ఇవ్వొద్దని నేరుగా బ్యాంకుకు వెళ్లి విచారణ చేయాలని సూచించారు. మొబైల్, జీమెయిల్‌కు వచ్చే లింకులను క్లిక్ చేయవద్దని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాబునాథ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కౌసల్యదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త



వైద్య పరీక్షలు చేస్తున్న మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు

బనగానపల్లె రూరల్: సీజనల్ వ్యాధుల కాలం కావడంతో విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు అన్నారు. మంగళవారం పట్టణంలోని రవ్వల కొండపై ఉన్న ఏపీ మోడల్ స్కూల్ బాలికలు, జ్యోతిరావ్ పూలే వసతి గృహం, బీసీ బాలుర వసతి గృహాలను సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఏదైన ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి మందులను వాడాలన్నారు. దోమల నుంచి రక్షణ కోసం దోమ తెరలను వాడాలని తెలిపారు. హాస్టల్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పలువురు విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఎంపీహెచ్‌ఈఓ నల్లగట్ల వెంకటేశ్వర్లు, ఎంఎల్‌హెచ్‌పీ రమేష్, ఆరోగ్య కార్యకర్త గ్రేసమ్మ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

- కేసు నమోదు

బేతంచెర్ల: పట్టణంలోని హనుమాన్‌నగర్ కాలనీకి చెందిన తనను అదనపు కట్నం కోసం భర్తతో పాటు అత్త, వదినలు, మరిది వేధింపులకు గురిచేస్తున్నారని బాధితురాలు మంగళవారం పోలీసులను ఆశ్రయించింది. వివరాలు.. హనుమాన్‌నగర్ కాలనీకి చెందిన పరశురాముడు కుమార్తె ఐశ్వర్య (అలియాస్ పల్లవి) ని ఏడాదిన్నర క్రితం నందికొట్కూరుకు చెందిన సంపటి వీరకుమార్‌కు ఇచ్చి వివాహం చేశారు. కొంత కాలంగా భర్త వీర కుమార్, అత్త సుంకమ్మ, వదినలు మాధవి, రంగమ్మ, మరిది శివ చంద్ర రూ. 2 లక్షలు, ఒక తులం బంగారు తీసుకురావాలని వేధింపులకు గురి చేస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మాసుం బాషా తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్

సంజామల: వర్షకాలం కావడంతో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సంజామల ఆరోగ్య కేంద్రం హెల్త్ ఎడ్యుకేటర్ నారాయణదాసు అన్నారు. మండల పరిధిలోని కమలపురి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులను అరికట్టవచ్చని తెలిపారు. అపరిశుభ్రత వల్ల దోమలు, ఈగలు వ్యాప్తి చెందుతాయని అన్నారు. దోమల వల్ల మలేరియా, డెంగీ, చికున్‌గున్యా తదితర వ్యాధులు వస్తాయన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

బేతంచెర్ల: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిని హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు, వైద్య సిబ్బందితో కలిసి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు అయినా మహిళలకు రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కోల్‌కతా ఘటన పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చట్టాలను తీసుకుని రావాలన్నారు. తల్లిదండ్రులు సైతం పిల్లలను విలువలు, సంప్రదాయాలు, క్రమశిక్షణతో పెంచాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు ప్రదీప్, భాస్కర్, రమేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ట పూజలు

కొలిమిగుండ్ల: స్థానిక నాయీ బ్రాహ్మణ కాలనీలో దాతల సహకారంతో నిర్మించిన త్యాగరాజస్వామి ఆలయంలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు విగ్రహ ప్రతిష్ట పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వేదపండితుడు ఆలూరి రాఘవేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో విశేష పూజలు జరుగుతాయన్నారు. 29న వివిధ ప్రాంతాలకు చెందిన సంగీత కళాకారులతో స్వామి గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. 30న ప్రత్యేక పూజల అనంతరం త్యాగరాజస్వామితో పాటు సీతా రామ,కోదండరామస్వామి విగ్రహాల ప్రతిష్ట జరుగుతుందని.. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో హోమాలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కోవెలకుంట్ల: పట్టణంలో జీర్ణోద్ధరణ గావించిన సోణ లింగేశ్వరస్వామి ఆలయంలో గణపతి, పార్వతి, నంది, నాగ, శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా మంగళవారం హోమాలు నిర్వహించారు. ప్రాతఃకాల పూజ, జపయంత్రాభిషేకం, జపఅనుష్టానాలు, గణపతి, రుద్ర, సుబ్రమణ్య హోమాలు, 108 కలశాలతో మూర్తి విగ్రహాలకు మహాస్నపనం, విశేష అభిషేకం, మంగళహారతి, తదితర కార్యక్రమాలు జరిగాయి. బుధవారం విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్టతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యులు బీవీ ప్రసాద రెడ్డి, జీవీ సుబ్బారెడ్డి తెలిపారు.

సారా విక్రేత అరెస్ట్

బేతంచెర్ల: మండల పరిధిలోని సీతారామాపురం గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్న మాదన్న అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మాసుం బాషా తెలిపారు. అతని వద్ద నుంచి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

సచివాలయాల్లో బదిలీల సందడి

కొలిమిగుండ్ల: గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో ఉద్యోగులు బదిలీల సందడిలో పడ్డారు. మండలంలో 16 గ్రామ సచివాలయాలు ఉండగా 124 మంది విధులు నిర్వహిస్తున్నారు. నోడ్యూ సర్టిఫికెట్, ఇతర సంతకాల కోసం ఉద్యోగులు ఎంపీడీఓ కార్యాలయం వద్దకు తిరుగుతున్నారు. ఇప్పటికే పలువురు ఆన్‌లైన్‌లో బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం అనంతపురం, వైఎస్సార్ జిల్లాలకు చెందిన ఉద్యోగులు ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. బదిలీల్లో భాగంగా చాలా మంది ఇతర జిల్లాలు, మండలంలో వేరే సచివాలయాలకు వెళ్లేందుకు దరఖాస్తు చేసుకుంటున్నారు. బదిలీల్లో ఇక్కడ ఉన్న ఉద్యోగులు ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతే వారి స్థానంలో ఇతరులు వస్తారా రారా అనేది చర్చనీయాంశంగా మారింది.

నేడు మండల సర్వసభ్య సమావేశం

డోన్ రూరల్ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరుగనుంది. ఈ మేరకు అధికారులు, ప్రజాప్రతినిధులు మండల మీట్‌కు హాజరు కావాలని ఎంపీపీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాల్సిందే



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

ప్యాపిలి: ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సీఐ వెంకటరామిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక కొత్త బస్టాండ్ ఆవరణలో ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఆటోలను అతివేగంతో నడపరాదన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూడదని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనానికి సంబంధించిన అన్ని రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు. లైసెన్సు లేకుండా వాహనాలు నడపరాదన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్ : రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారిచాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ సూచించారు. మంగళవారం మండలంలోని యాగంటిపల్లె గ్రామ సమీపంలో ఉన్న కృషివిజ్ఞాన కేంద్రం(కేవీకే)లో ప్రకృతి వ్యవసాయం మెలకువలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం దిగుబడులకు మార్కెట్‌లో మంచి ధర ఉంటుందని, పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయన్నారు. పలువురు శాస్త్రవేత్తలు ప్రకృతి వ్యవసాయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కేవీకే ప్రధాన శాస్త్రవేత్త ధనలక్ష్మి, జిల్లా వనరుల ఉపసంచాలకులు సరళమ్మ, కేవీకే ఏఈఓ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ ఆకస్మిక తనిఖీ



హాస్టల్ సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎంపీడీఓ, తహసీల్దార్

సంజామల: మండల కేంద్రంలోని బీసీ సంక్షేమ హాస్టల్‌ను ఎంపీడీఓ విజయకుమార్ రెడ్డి, తహసీల్దార్ అనీల్ కుమార్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. హాస్టల్‌లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హాస్టర్ ప్రహరీ, సిబ్బంది కొరత ఉందని గుర్తించారు. సమస్యల పరిష్కారానికి నివేదిక పంపుతామని పేర్కొన్నారు. విద్యార్థులకు సౌకర్యాలతో పాటు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని సూచించారు. బీసీ హాస్టల్ సంక్షేమ అధికారి మునిరాజు ఉన్నారు.

త్వరలో గోరుకల్లు రిజర్వాయర్ నుంచి తాగునీరు



ముద్దవరంలో ఓవర్ హెడ్ ట్యాంక్ పనులను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

బేతంచెర్ల: గోరుకల్లు రిజర్వాయర్ నుంచి త్వరలో గ్రామాలకు తాగునీరు సరఫరా చేయనున్నట్లు నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శివలక్ష్మి తెలిపారు. మంగళవారం ముద్దవరం, ఎం.పెండేకల్లు పంచాయతీ మర్రికుంట గ్రామాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులను సర్పంచ్‌లు చిన్న తిమ్మయ్య, ముచ్చు రామక్క, ఎంపీటీసీ సభ్యులు మధు, మహేశ్వరమ్మతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి రూ. 351 కోట్లతో వాటర్ గ్రిడ్ పథకం తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా గోరుకల్లు రిజర్వాయర్ నుంచి గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తారన్నారు. ఇది ప్రారంభం అయితే తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, బుగ్గన కుమార్ రెడ్డి, బాబుల్‌రెడ్డి, ముర్తుజావలీ, ఖాజా, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.